క్లుప్తంగా

కోటదిబ్బ దర్గా ఉరుసు ఉత్సవాలు ప్రారంభం



ఉరుసు కార్యక్రమాల్లో ప్రధాన ఆకర్షణగా నిలిచిన గుమ్మటం

ఏలూరు (ఆర్ ఆర్‌పేట): నగరంలోని కోట దిబ్బపై ఉన్న హజరత్ సయ్యద్ బాయజీద్ మహాత్ముల దర్గాలో మహాత్ముని ఉరుసు ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉరుసు ఉత్సవాల్లో భాగంగా ఉదయం జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం దర్గాలో దివ్య ఖుర్‌ఆన్ గ్రంథ పఠనం చేసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రాత్రి 10.30 గంటలకు స్థానిక గడియార స్థంభం ప్రాంతంలోని జీనత్ మంజిల్ నుంచి గంధం కలశ ఊరేగింపు ప్రారంభమైంది. ఈ ఊరేగింపు తెల్లవారు జాము వరకూ నగరంలోని వివిధ ప్రాంతాల్లో తిరిగి కోటదిబ్బ దర్గాకు చేరుకుంటుంది. ఈ సందర్భంగా దర్గా వద్ద ఏర్పాటు చేసిన గుమ్మటం భక్తులకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. దర్గా వంశపారంపర్య ముజావర్లు షేక్ హుస్సేన్, షేక్ సాబీర్ హుస్సేన్, షేక్ సబ్బీర్ హుస్సేన్ కార్యక్రమాలు పర్యవేక్షించారు.

పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి



దరఖాస్తులు పూర్తి చేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న మహిళా సమాఖ్య నాయకులు

ఏలూరు (టూటౌన్): గత ఎన్నికల సందర్భంగా కూటమి నాయకులు ఇచ్చిన హామీ మేరకు పేదలందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షురాలు వరకా శ్యామల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక రామచంద్రరావు పేటలో ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులు పూర్తి చేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వరకా శ్యామల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడు నెలల పూర్తి కావస్తుందని, ఎన్నికల హామీ మేరకు పట్టణాలలో 2 సెంట్లు,గ్రామీణ ప్రాంతాలలో 3 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గృహ నిర్మాణ సామగ్రి ధరలు పెరిగిన కారణంగా నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అడారి మల్లీశ్వరి, దొడ్డి లక్ష్మమ్మ, మల్ల కోటేశ్వరి, పెంటకోటి ఉమా గౌరీ,మునకాల శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణతంత్ర వేడుకలు

ఏలూరు టౌన్: ఎందరో మహనీయులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా స్వేచ్ఛ, సమానత్వం కోసం పోరాటం చేశారని, వారి త్యాగాల స్ఫూర్తిగా దేశ సమైక్యతకు పాటుపడాలని వైఎస్సార్ సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్ళపల్లి జయప్రకాష్ అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో 76వ గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ నగర అధ్యక్షుడు గుడిదేశి శ్రీనివాసరావు, సమన్వయకర్త జయప్రకాష్ జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవవందనం చేశారు. స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాసరావు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు నెరుసు చిరంజీవి, మాజీ కార్పొరేటర్ దాసరి రమేష్, నగర మహిళా అధ్యక్షురాలు జిజ్జువరపు విజయనిర్మల, నగర బీసీ సెల్ అధ్యక్షుడు కిలాడి దుర్గారావు, నగర ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఇనపనూరి జగదీష్, నగర మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ కైసర్, వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు పల్లి శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు తంగెళ్ళ రాము, జిల్లా ఆర్‌టీఐ అధ్యక్షుడు స్టాలిన్, జిల్లా కార్యదర్శులు జనార్థన్, బుద్దాల రాము, బత్తిన మస్తాన్‌రావు, తులసీవర్మ, లీగల్ సెల్ నగర అధ్యక్షుడు ప్రత్తిపాటి తంబి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు దేవరకొండ నాగేశ్వరరావు, యువజన విభాగం అధ్యక్షుడు గంటా సాయిప్రదీప్, సోషల్‌మీడియా అధ్యక్షుడు సుజన్, నగర ఆర్‌టీఐ అధ్యక్షుడు పాతినవలస రాజేష్, అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలు బుజ్జమ్మ, గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడు మద్దాల ఫణి, ప్రచార విభాగం అధ్యక్షుడు కొల్లిపర భగవాన్, వాణిజ్య విభాగం సెక్రటరీ బాచి, జిల్లా దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు షమీ తదతరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల వద్ద

ఏలూరు(మెట్రో): 76వ భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆఫీసర్స్ క్లబ్ లో ఆదివారం జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్యం కోసం త్యాగాలు చేసిన మహాపురుషులకు నివాళులఅర్పించారు. అలాగే జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా పౌర సంబంధాధికారి ఆర్‌వీఎస్ రామచంద్రరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో డివిజినల్ పీఆర్‌ఓ సీహెచ్ దుర్గాప్రసాద్, ఏవీ సూపర్‌వైజర్ సీహెచ్ రాంబాబు, కె.ధనుంజయరాజు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టరేట్‌లో


76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఏలూరు జిల్లా కలెక్టరేట్‌లో ఆదివారం జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. తొలుత మహాత్మాగాంధీ, బీఆర్ అంబేద్కర్‌లకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేశసమగ్రతా, సమైక్యతకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, ఆర్డీఓ అచ్యుత అంబరీష్, డీఎస్ఓ ఆర్‌ఎస్ఎస్ రాజు, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజరు వి.శ్రీలక్ష్మి, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎస్.పుష్పలత, జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఆర్‌వీ నాగరాణి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవికాదేవి, కె.భాస్కర్, కలెక్టరేట్ ఏఓ నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.



ఏలూరు టౌన్: వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గౌరవవందనం చేస్తున్న సమన్వయకర్త జయప్రకాష్, నాయకులు



ఏలూరు (మెట్రో): ఆఫీసర్స్ క్లబ్ గణతంత్ర వేడుకల్లో వందన సమర్పణ చేస్తున్న జేసీ ధాత్రిరెడ్డి



ఏలూరు (మెట్రో): గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జేసీ పి.ధాత్రిరెడ్డి

వివిధ పాఠశాలల వద్ద

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని వివిధ కార్యాలయాలు, వివిధ పార్టీలు, పలు విద్యా సంస్థలు, కళా సంస్థల ఆధ్వర్యంలో 76వ గణతంత్ర వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఆయా కార్యాలయాల్లో ఉదయం జెడా ఎగురవేసి జాతీయ పతాకానికి గౌరవ వందనం చేశారు. నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సీఆర్‌ఆర్ అటానమస్ కళాశాల, సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల, ఏఆర్‌డీజీకే మున్సిపల్ హైస్కూల్, శ్రీశ్రీ విద్యా సంస్థలు, శ్రీ సూర్య ఇంగ్లీష్ మీడియం హై స్కూల్, శ్రీ శర్వాణి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, శ్రీ భారతి స్కూల్, వైఎంహెచ్‌ఏ హాలు, సాహిత్య మండలి హాలు, ది ఏలూరు కోఆపరేటివ్ హౌస్ మార్ట్‌గేజ్ సొసైటీ, జిల్లా కాంగ్రెస్ కార్యాలయం, అంజుమన్ ముహాఫిజుల్ ఇస్లాం సంస్థ తదితర ప్రాంగణాల్లో జాతీయ జెండా ఎగురవేశారు. పలు సంస్థల ప్రాంగణాల్లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి,

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి



జయప్రకాష్‌ను గజమాలతో సత్కరిస్తున్న ఏలూరు నగర ఎస్సీ సెల్ అధ్యక్షుడు జగదీష్

ఏలూరు టౌన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పాలిట పెన్నిధిగా ఉంటూ అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి మేలు చేశారనీ, నేడు కూటమి సర్కారు పేదల జీవితాలతో చెలగాటం ఆడుతోందని వైఎస్సార్ సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ఏలూరు నగర ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన ఇనపనూరి జగదీష్ పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి సమన్వయకర్త జయప్రకాష్‌ను ఆదివారం గజమాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. తనపై విశ్వాసంతో బాధ్యతలు అప్పగించిన ఏలూరు జిల్లా పార్టీ అధ్యక్షులు దూలం నాగేశ్వరరావు, ఏలూరు సమన్వయర్త జేపీ, నగర అధ్యక్షులు గుడిదేశి శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు నెరుసు చిరంజీవి, నగర బీసీ సెల్ అధ్యక్షులు కిలాడి దుర్గారావు, జిల్లా ఆర్‌టీఐ అధ్యక్షులు స్టాలిన్‌బాబు, నగర మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండీ కైసర్ తదితరులు పాల్గొన్నారు.

అఖిల గాండ్ల తెలికుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

ఏలూరు (టూటౌన్): అఖిల గాండ్ల తెలికుల కార్పొరేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలని అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అంబటి గురుమూర్తి కోరారు. స్థానిక సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు గురుమూర్తి ఇంటి వద్ద ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గురుమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, దాని ద్వారా కుల వృత్తులు చేసుకుంటున్న వారికి ఆర్థిక సహాయం అందించి, వారికి ప్రభుత్వం పూర్తి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పాపోలు వెంకట శ్రీనివాస్, కోశాధికారి చెన్నం వెంకటేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్పాడ ఆనంద్ కుమార్, అరిసెల విజయ సాయిబాబు పాల్గొన్నారు.

వాడవాడలా గణతంత్ర సందడి

ఏలూరు (టూటౌన్): భారత రాజ్యాంగం సమానత్వ స్ఫూర్తిని తెలియజేస్తుందని నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్, కమిషనర్ ఏ భాను ప్రతాప్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఆదివారం గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. సందర్భంగా మేయర్ నూర్జహాన్ గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కమిషనర్ ఏ.భాను ప్రతాప్ జాతీయ జెండా ఆవిష్కరించారు. విధుల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచిన 30 మంది ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ జి.చంద్రయ్య, డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి పాల్గొన్నారు. దొండపాడులోని పరివర్తన పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు బి.రామ్ కుమార్ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. జనసేన కార్యాలయంలో ఏపీఎస్‌ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్‌రెడ్డి అప్పలనాయుడు, సీపీఐ కార్యాలయంలో డేగా ప్రభాకర్, భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్ కిషోర్ జాతీయ జెండాను ఎగురవేశారు. అలాగే ఏలూరు కొత్త రోడ్డులోని నవస మాజ్ సొసైటీ కార్యాలయంలో గణతంత్ర వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా తపాలా శాఖ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ జాతీయ నాయకులు దాసరి నాగేంద్ర బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో నేతల రమేష్ బాబు, కొత్తల పూర్ణ మల్లికార్జున్, దాసి వెంకటేశ్వర్లు, కండవల్లి స్వామిదాసు పాల్గొన్నారు.



ఏలూరు (టూటౌన్): ఏలూరు కార్పొరేషన్‌లో గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న అధికారులు



ఏలూరు (టూటౌన్): అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దాసరి నాగేంద్ర

లారీ ఓనర్ల ఆందోళన

చింతలపూడి: ప్రభుత్వం లారీ ఓనర్లకు ధాన్యం రవాణా చార్జీలను తక్షణం చెల్లించాలని లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉక్కుర్తి నాగేశ్వరావు డిమాండ్‌చేశారు. చింతలపూడిలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ 2024–2025 ఖరీఫ్ సీజన్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి లారీ ఓనర్లు ధాన్యం రవాణా చేశారన్నారు. సివిల్ సప్లై అధికారులు, ప్రభుత్వం లారీ ఓనర్లకు ఇప్పటివరకు ఎలాంటి రవాణా చార్జీలు చెల్లించలేదని వాపోయారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ధాన్యం రవాణా చేసిన చార్జీలను త్వరగా చెల్లించాలని డిమాండ్‌చేశారు.

బాలోత్సవం నిర్వహణ అభినందనీయం



బాలోత్సవంలో వివిధ అంశాల్లో విజేతలైన బాలలకు బహుమతులు అందిస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): బాలోత్సవం పిల్లల సంబరాలు పేరిట వేలాదిమంది విద్యార్థులను ఒకచోట చేర్చి, వారిలోని సృజనాత్మకతను, శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించే ప్రయత్నం చేయడం అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. శుక్ర, శనివారాల్లో స్థానిక సిద్ధార్థ క్వెస్ట్ పాఠశాలలో నిర్వహించిన హేలాపురి బాలోత్సవం ఐదో పిల్లల సంబరాల్లో విజేతలకు ఆదివారం స్థానిక సీఆర్‌రెడ్డి కళాశాల ఆడిటోరియంలో బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సభకు బాలోత్సవ కమిటీ ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఈ బాలోత్సవంలో కొత్తవారిని భాగస్వాములను చేస్తున్నామన్నారు. ఈ సంవత్సరం కొత్తగా మైక్రో ఆర్ట్స్‌లో కూడా పోటీ పెట్టామన్నారు. 2019లో మొదటిసారిగా కేవలం 3200 మంది విద్యార్థులతో ప్రారంభమైన ఈ బాలోత్సవం నేడు 14 వేల మందికి వేదిక అయ్యిందన్నారు. మొత్తం 69 అకడమిక్, కల్చరల్ అంశాల్లో కిడ్స్, సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్ కేటగిరీల్లో గెలుపొందిన 865 మంది విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఆహ్వాన సంఘం చైర్‌పర్సన్ అడుసుమిల్లి నిర్మల, ప్రధాన కార్యదర్శి డాక్టర్ దేవరకొండ వెంకటేశ్వర్లు, నిర్వాహక కమిటీ కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, సీఆర్‌రెడ్డి కళాశాల ప్రిన్సిపల్ కేఏ రామరాజు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గుత్తా గిరిబాబు, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఆళ్ల సతీష్, వేమా సురేష్, కల్చరల్ అకడమిక్ అంశాల కన్వీనర్లు ముస్తఫా ఆలీ, ఎస్.కస్తూరిరావు, బి.హేమసుందర్, పి.మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు ఏలికపాము నివారణ మందు వేయాలి



కొండేపాడులో మేకలకు నట్టల నివారణ మందు వేస్తున్న పశు వైద్యులు

గణపవరం: కొండేపాడులో ఆదివారం పశుఆరోగ్య వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ శీతాలం పుల్లయ్యనాయుడు ప్రారంభించారు. ఈసందర్భంగా గణపవరం పశుసంవర్ధక శాఖ ఏడీ డీఎం నాయక్ మాట్లాడుతూ పశువులకు పుట్టినప్పటి నుంచే ఏలిక పాము నివారణ మందు క్రమం తప్పకుండా వేయాలని, దీనివల్ల పశువులు సకాలంలో ఎదకు వస్తాయని వివరించారు. ఆవులు, గేదెలకు గర్భకోశ పరీక్షలు చేశారు. ఈ శిబిరంలో వివిధ ఆరోగ్య సమస్యలపై తీసుకువచ్చిన 98 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి, పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.రైతులకు ఉచితంగా మినరల్ మిక్చర్ పంపిణీ చేశారు. ఈనెల 27న జల్లి కొమ్మరలో, 28న వాకపల్లిలో, 29న ముగ్గుళ్లలో, 30న కోమ్రులో పశువైద్యశిబిరాలు నిర్వహిస్తామని నాయక్ తెలిపారు. వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ బి.నాగజ్యోతి, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ సమాజ స్థాపనలో భాగస్వాములు కావాలి

భీమడోలు: ఉత్తమ సమాజ స్థాపన లక్ష్యంగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ పని చేస్తుందని జిల్లా శాంతిరథాల కమిటీ చైర్మన్ అప్పక రాంబాబు అన్నారు. పోలసానిపల్లి – 2 ప్రాథమిక పాఠశాలలో ఆదివారం మండల మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల సాధారణ సమావేశం నిర్వహించారు.అనారోగ్యం కారణంగా ఆపరేషన్ చేయించుకున్న పోలసానిపల్లి పంచాయతీ గుమస్తా వెంకట రమణకు మానవత సంస్థ అందించిన రూ.3 వేల ఆర్థిక సాయాన్ని సర్పంచ్ చేతుల మీదుగా అందజేశారు. మానవత సంస్థకు మూడవ ఫ్రీజర్ కొనుగోలు చేసేందుకు సర్పంచ్ రహీమ రూ.10వేల విరాళంగా ప్రకటించారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	35
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	39
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	18
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	36

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	28
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	29
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	31
ఏలూరు-బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	30
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	36
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	24
ఏలూరు - తిరుపతి	16.00	4830	31
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	30

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	16	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	16	చిక్కుడు కాయలు	44
వంకాయలు (కాంతులు)	28	బీన్లచిక్కుడు	64
వంకాయలు (తెలుపు)	24	చామదుంపలు	44
బెండకాయలు	40	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	34	కంద	60
కాకర కాయలు	32-40	బీట్‌రూట్	34
బీరకాయలు	40	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	00	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	20	అల్లం	60
క్యారెట్	32	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	38	పాలకూర	10
బంగాళదుంపలు	32	చుక్కకూర	10
ఉల్లిపాయలు	40	తోటకూర	10
గోరుచిక్కుడు	30	గోంగూర	07-10
దోసకాయలు	26	పుదీనా	05
ఆనబకాయ (1)	25-30	క్యాప్సికమ్	60
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	44

రహదారి ఇలా.. ప్రయాణమెలా?

అధ్వానంగా హనుమాన్‌నగర్–కొత్తూరు రోడ్డు



దుమ్ము–ధూళితో ప్రమాదకరంగా ఉన్న హనుమాన్‌నగర్–కొత్తూరు రోడ్డు



గత ప్రభుత్వం రోడ్డు పక్క తమ్మిలేరుకు నిర్మించిన రివిట్‌మెంట్ వాల్



గత ప్రభుత్వ హయాంలో హనుమాన్‌నగర్ వద్ద అభివృద్ధి చేసిన సీసీరోడ్డు

ఏలూరు రూరల్: ఏలూరు హనుమాన్‌నగర్–కొత్తూరురోడ్డు అభివృద్ధి చేయాలని వాహన చోదకులు కోరుతున్నారు. గోతులమయమైన రోడ్డుపై ప్రయాణించలేకపోతున్నామని వాపోతున్నారు. దుమ్ము ధూళితో శ్వాసకోస సమస్యలు ఎదుర్కొంటున్నామని ఆందోళన చెందుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా పోస్తున్న మురుగుకాలువ సిల్ట్, పెరిగిపోయిన పిచ్చిమొక్కలు కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 7 నెలలు దాటిన రోడ్డు అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నట్టు ఉంది. ఇటీవల కార్పొరేషన్ అధికారులు ప్రొక్లెయిన్‌తో రోడ్డుపై గోతులు చదును చేశారు. దీంతో చోదకులు రోడ్డు అభివృద్ధి చేస్తున్నారని సంబరపడ్డారు. తీరా చూస్తే గోతులు చదును చేసి వదిలేశారు. నిన్నటి వరకూ గోతుల్లో పయనించలేక అవస్థలు పడిన చోదకులు, ఇప్పుడు దుమ్ముధూళితో అగచాట్లకు గురౌతున్నారు.

గతంలో అభివృద్ధి పరుగులు

సుమారు 2000 మీటర్ల దూరం ఉన్న ఈ రోడ్డు అభివృద్ధి చేసేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేసింది. ఇందులో భాగంగా మొదట విడతలో హనుమాన్‌నగర పరిసరాల్లో లోతట్టు రోడ్డును సీసీ రోడ్డుగా అభివృద్ధి చేసింది. వర్షకాలం, వరదల సమయంలో రోడ్డు కోతకు గురికాకుండా కోట్ల రూపాయలు ఖర్చు చేసి తమ్మిలేరు ఏటిగట్టుకు రివిట్‌మెంట్ వాల్ కట్టింది. దీని కారణంగా రోడ్డు మరింత విశాలమైంది. దీంతో రోడ్డు ఆక్రమణకు గురికాకుండా అధికారులు కంచె సైతం ఏర్పాటు చేశారు. ఫలితంగా రానున్న రోజుల్లో రోడ్డు విస్తరించే అవకాశాలు మెరుగయ్యాయి. దీనికి తోడు స్థానిక నివాసితులకు వరద ముప్పు తప్పింది.

గ్రామాల నుంచి నగరానికి అనుసంధానం

నగర కార్పొరేషన్ పరిధిలో స్థానిక పడమట లాకుల నుంచి కొత్తూరు జ్యూట్‌మిల్లు వంతెన వరకూ ఉన్న రోడ్డు వాహన చోదకులకు ఎంతో ఉపయుక్తంగా ఉంది. ఈ రోడ్డు మీదుగా నిత్యం 250 నుంచి 300కు పైగా ద్విచక్ర, ఆటోలతో పాటు ట్రాక్టర్లు ప్రయనిస్తున్నాయి. పెదపాడు మండలం కొత్తూరు, పాతముప్పర్రు, కొత్త ముప్పర్రు, వీరమ్మకుంట తదితర గ్రామాల ప్రజలు ఈ రోడ్డు మీదుగా ఏలూరుకు రాకపోకలు సాగిస్తున్నారు. ఇదే క్రమంలో ఏలూరు నుంచి పదుల సంఖ్యలో వ్యాపారస్తులు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్నారు. దీనికి తోడు ఎగువ గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న అనేక మంది ఉపాధ్యాయులు, ఉద్యోగులు రోడ్డు మీదుగా పయనిస్తున్నారు. ఎంతో ప్రాధాన్యత కల్గిన రోడ్డు అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

దుమ్ముతో ఇబ్బంది

నిన్నటి వరకూ గోతుల్లో పయనించలేక నానా అగచాట్లు పడ్డాం. ఇప్పుడు రోడ్డు మీద ఎక్కడ చూసిన దుమ్ము ఎగిసిపడుతుంది. ముక్కుల్లో దుమ్ము చేరి తుమ్ములు వస్తున్నాయి. శ్వాస తీసుకోవడం కూడా ఇబ్బందిగా మారుతోంది. కొన్నిసార్లు ఎదుట వచ్చే వాహనాలు కనిపించడం లేదు. రోడ్డు అభివృద్ధి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. – ఎస్ కోటేశ్వరరావు, వాహనచోదకుడు

రోడ్డు విస్తరించాలి

ఈ రోడ్డు గ్రామాల నుంచి ఏలూరుకు రాకపోకలు సాగించడానికి ఎంతో బాగుంటుంది. గత ప్రభుత్వం హయాంలో తమ్మిలేరుకు రివిట్‌మెంట్ వాల్ కట్టడం వల్ల రోడ్డు స్థలం పెరిగింది. ఈ స్థలంలో సిల్ట్, పిచ్చి మొక్కలు తొలిగించి అధికారులు రోడ్డు మరింత వెడల్పు చేసి అభివృద్ధి చేయాలి. అప్పుడు ఈ ప్రాంత కూడా అభివృద్ధి చెందుతుంది. – కె.సాంబశివరావు, స్థానికుడు

గోతులు సరి చేసి వదిలేశారు

కొద్దిరోజుల క్రితం అధికారులు ప్రొక్లెయిన్‌తో ఈ రోడ్డుపై పడ్డ గోతులు చదును చేశారు. అది చూసి కొత్త రోడ్డు వేస్తున్నారని అనుకున్నా. కాని గోతులు చదును చేసి వదిలేశారు. మళ్లీ ఇప్పటి వరకూ రోడ్డు పనులు చేయలేదు. – ఎం.రాంబాబు, ప్రయాణికుడు